
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
ఆదివారం 15 సెప్టెంబరు 2024



నయనానందం.. శ్రీకృష్ణలీలామృతం



పుట్టపర్తి, సెప్టెంబరు 14: కేరళలోని కాలికట్ బాలవికాస్ చిన్నారులు.. శ్రీకృష్ణుడి లీలలను కళ్లకు కట్టారు. స్థానిక సాయికుల్వంత్ సభామండపంలో ఓనం వేడుకలు రెండోరోజు శనివారం కొనసాగాయి. బాలవికాస్ చిన్నారులు భాగవతంలోని ఘట్టాలను సంగీత నృత్యరూపకం ద్వారా ప్రదర్శించారు. చిన్నారుల నృత్యంతో భక్తులు తన్మయత్వం పొందారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నృత్యం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు

మడకశిరకు పారిశ్రామిక వాడ

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బృందానికి కేంద్రమంత్రి కుమారస్వామి హామీ



కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు

మడకశిరటౌన్, సెప్టెంబరు 14: నియోజకవర్గంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తామని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి భరోసా ఇచ్చారు. బెంగళూరులోని జేడీఎస్ పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రిని శనివారం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కలిశారు. కుమారస్వామి మాట్లాడుతూ.. కర్ణాటక సరిహద్దున ఉన్న మడకశిరలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా పక్కనే కర్ణాటకలోని వెనుకబడిన ప్రాంతాలైన శిర, మధుగిరి, హిరియూరు, పావగడ ప్రజలకు ఉద్యోగావకాశాలు దక్కుతాయన్నారు. పరిశ్రమల శాఖ తరఫున అన్నివిధాలా సాయం చేస్తానన్నారు. శాఖాపరంగా చర్చలు జరుపుతానన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి, ఉద్యోగాలు మెరుగవుతాయన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. మడకశిర పరిసర ప్రాంతాలకు చెందిన యువత వేలాది మంది బెంగళూరులో పనిచేస్తున్నారన్నారు. మడకశిర ప్రాంతంలోనే 3వేల ఎకరాల భూమి ఉందనీ, పెనుకొండ, శిర వైపు జాతీయ రహదారులు అనుబంధంగా ఉన్నాయన్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారానే వెనుకబడిన మడకశిర అభివృద్ధి సాధ్యమన్నారు. అదే సమయంలో మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడను మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కలిశారు.

టార్చర్ భరించలేకున్నా..

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 14: ఉన్నతాధికారి వేధింపులు భరించలేకపోతున్నామనీ, ఆత్మహత్య చేసుకుంటానంటూ సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో 104 డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న శ్రీరామిరెడ్డి శనివారం సెల్ఫీ వీడియో పంపడం కలకలం రేపింది. మండలంలోని చాకర్లపల్లి రైల్వేట్రాక్ వద్ద సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. 104 ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ (ఓఈ) రామకృష్ణ తనను ప్రతి చిన్నదానికీ వేధిస్తున్నాడనీ, అతడి టార్చర్ భరించలేక చనిపోతున్నట్లు తెలిపాడు. చిలమత్తూరు మండలం కోడూరు తోపు గ్రామానికి చెందిన శ్రీరామిరెడ్డి సోమందేపల్లిలో నాలుగేళ్లుగా పనిచేస్తున్నాడు. ఓఈ తనకు అనుకూలమైన వారిని ఉద్యోగాల్లో నియమించుకునేందుకు పనిచేస్తున్న స్టాఫ్‌ను వేధించి, రాజీనామా చేసేలా చేస్తున్నాడని సెల్ఫీ వీడియోలో వాపోయాడు. సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయింది. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, అతడిని కాపాడారు. ఆత్మహత్యాయత్నంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.



సెల్ఫీ వీడియోలో శ్రీరామిరెడ్డి

థ్యాంక్యూ.. సీఎం సార్..

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 14: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఎక్సైజ్‌శాఖలో విలీనం చేయడంపై జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. జిల్లాకేంద్రంలోని జిల్లా ఎక్సైజ్‌కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ నుంచి సెబ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. దీనిపై ఆ శాఖాధికారులు, సిబ్బంది అప్పట్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం సెబ్‌ను విలీనం చేయడంతో ఎక్సైజ్ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారి సహదేవ, సీఐలు గౌరీప్రియ, కన్నయ్య, ఎస్‌ఐలు రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ఉద్యోగ ప్రదాత చంద్రబాబు

● కియ రాకతో వేల మందికి ఉపాధి ● మంత్రి సవిత



గొల్లపల్లి డ్యాంలో జలహారతి ఇస్తున్న మంత్రి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 14: వెనుకబడిన ప్రాంతంలో కియ పరిశ్రమ ఏర్పాటు చేయించి వేల మందికి ఉపాధి కల్పించిన ఉద్యోగ ప్రదాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని దుద్దేబండలో అంగనవాడీ భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ చేపట్టారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. కియ పరిశ్రమ ఏర్పాటుతో వేలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఎకరా రూ.10లక్షలున్న భూమి విలువ ప్రస్తుతం రూ.3కోట్లదాకా పలుకుతోందన్నారు. దీనికి కారణం చంద్రబాబేనన్నారు. అనంతరం గొల్లపల్లి రిజర్వాయర్‌కు చేరుకున్నారు. కృష్ణాజలాలు విడుదల చేయడంతో మంత్రి సవిత, అధికారులు, టీడీపీ నాయకులు జలహారతి ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీసీల విద్యాభివృద్ధికి టీడీపీ పెద్దపీట

బుక్కపట్నం: టీడీపీ పాలనలో బీసీల విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను మంత్రి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ హాస్టళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ అన్నారు. రాష్ట్రంలో మొత్తం 107 బీసీ హాస్టళ్లు ఉంటే.. అందులో 105 టీడీపీ హయాంలో నిర్మించినవేనన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ నియోజకవర్గంలో ఒకటి, ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన నియోజకవర్గంలో మరొకటి మాత్రమే కట్టారన్నారు. మాజీ సీఎం జగన్.. హాస్టళ్ల రంగులు మార్చి, పబ్బం గడుపుకున్నారన్నారు. అనంతరం మంత్రి పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. త్వరలో మండల శివారులో నిర్మించిన నూతన భవనంలోకి పాఠశాలను మార్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి రూ.50వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

సమర్థవంతంగా పనిచేశారు..

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 14: జిల్లాలో వినాయక వేడుకల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసు సిబ్బంది సమర్థవంతంగా పనిచేశారని ఎస్పీ రత్న శనివారం ప్రకటనలో అభినందించారు. పోలీసుల నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. సమర్థవంతంగా పనిచేసిన వారికి త్వరలో రివార్డులు అందజేస్తామన్నారు.

కాసుల కష్టాలు..!

ఎమ్మార్సీల్లో దయనీయ పరిస్థితులు

పైసా విదల్చని గత వైసీపీ ప్రభుత్వం

సొంత డబ్బు వెచ్చిస్తున్న విద్యాశాఖ అధికారులు



ధర్మవరం ఎమ్మార్సీ

ధర్మవరం, సెప్టెంబరు 14: మండల వనరుల కేంద్రా(ఎమ్మార్సీ)ల్లో పైసాలేదు. నిర్వహణ కూడా భారమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం పైసా విదల్చకపోవడంతో అధికారులు ఇబ్బందులు పడ్డారు. సొంత డబ్బు వెచ్చిస్తున్నారు. కార్యాలయ నిర్వహణ ఖర్చులకు జేబులు తడుముకోవాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నారు. నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వమైనా ఎమ్మార్సీల నిర్వహణకు నిధులివ్వాలని కోరుతున్నారు. జిల్లాలో 32 మండలాలున్నాయి. గతంలో ఒక్కో మండలానికి ఒక విద్యాధికారి (ఎంఈఓ) ఉండేవారు. గత వైసీపీ ప్రభుత్వం మరొకరిని అదనంగా నియమించింది. పాలనా సౌలభ్యం కోసమంటూ ఎంఈఓ-2ను నియమించడంతో కష్టాలు మొదలయ్యాయి. ఆ ఇద్దరు ఎంఈఓల మధ్య సమన్వయలోపంతోపాటు నిధుల్లేక మండల విద్యాశాఖ కుదేలవుతుంది. ప్రతి మండలానికి ఏడాదికి రూ.70వేలు నిధులు ప్రభుత్వం విడుదల చేసేది. ఈ నిధులను ఎమ్మార్సీ నిర్వహణకు వినియోగిస్తుండేవారు. రెండేళ్లుగా ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో ఎంఈఓలే జీతాల నుంచి కార్యాలయ నిర్వహణ ఖర్చులు భరించుకోవాల్సి వస్తోంది. ఇలా జిల్లావ్యాప్తంగా ఏటా రూ.23లక్షలదాకా ఎంఈఓలపై భారం పడింది. రెండేళ్లలో దాదాపు రూ.46 లక్షలు సొంత డబ్బు వెచ్చించినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎమ్మార్సీలకు నిధులివ్వాలని ఎంఈఓల సంఘం తరఫున ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసినా ప్రయోజనం లేదని వారు వాపోతున్నారు.

నిధులు దేనికి వెచ్చించాలంటే..

ఎమ్మార్సీల్లో ఎంఈఓలు విధులు నిర్వహిస్తుంటారు. కార్యాలయ ఖర్చులకు ప్రభుత్వం నిధులిస్తుంది. విద్యుత్ చార్జీలు, ఇంటర్నెట్, స్టేషనరీ, రవాణా, సమావేశాలు, సమీక్షలు, కార్యాలయ నిర్వహణకు వాటిని ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రెండేళ్లుగా నిలిచిపోవడంతో ఆ ఖర్చులను ఎంఈఓలే భరిస్తూ వస్తున్నారు. 2023-24లో అప్పటి వైసీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ మంజూరు చేయలేదు. దీంతో అప్పులు చేసి, ఎమ్మార్సీకి కనీస సౌకర్యాలు కల్పిస్తున్నామంటూ ఎంఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు రాకపోవడం వాస్తవమే

మండల విద్యాశాఖ కార్యాలయాల నిర్వహణకు రెండేళ్లుగా ప్రభుత్వం నిదులు మంజూరు చేయలేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. ఆ మేరకు ప్రతిపాదనలు కూడా పంపాం.

-ఆనంద్‌బాబు, సమగ్రశిక్ష ఎఫ్ఏఓ

ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2.89 లక్షల హెక్టార్లు కాగా.. 1.49 లక్షల హెక్టార్లలోనే వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి పంటలు సాగయ్యాయి. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,74,910 హెక్టార్లు కాగా.. 1.22 లక్షల హెక్టార్లలో సాగయినట్లు వ్యవసాయ శాఖ అధికారుల సమాచారం.

ఎండుముఖం పట్టిన వేరుశనగ పైరు



ఎండిపోయిన వేరుశనగ కాయలను చూపుతున్న రైతు

ఏటా.. ఒకటే వ్యథ..!

వెంటాడుతున్న వర్షాభావం

2022 ఖరీఫ్‌లో..
భారీ వర్షాలకు
పంటలు మునిగిపోయాయి..
పంటలు కుళ్లిపోయాయి..
అన్నదాత సర్వం నష్టపోయాడు..

2023లో..
తొలుత అదునులో వర్షాలు పడ్డాయి..
పంటలు అధిక విస్తీర్ణంలో సాగుచేశారు..
తీరా చేతికొచ్చే సమయంలో..
వరుణుడు ముఖం చాటేశాడు..
పంటలు నిలువునా ఎండిపోతుండడంతో
రైతులు తొలగించుకున్నారు..
అప్పులపాలయ్యారు..

ప్రస్తుతం..
అరకొర పదునులోనే పంట పెట్టారు..
అన్నిచోట్లా వరదలు వస్తున్నాయి..
జిల్లాలో మాత్రం..
వాన జాడలేదు..
ఎండలు
మండిపోతున్నాయి.
పంటలు ఎండుముఖం
పట్టాయి..
మరో వారం వర్షం
రాకపోతే..
తొలగించు
కోవాల్సిందే..
అన్నదాత ఆకాశంవైపు
చూస్తున్నాడు..

వారంలో వర్షం పడకపోతే పంటను తొలిగిస్తాం

గతేడాది వర్షాభావంతో వేరుశనగ పంట ఎండిపోవడంతో ట్రాక్టర్‌తో తొలగించా. ఈసారి మూడెకరాల్లో సాగు చేశా. రూ30 వేలదాకా పెట్టుబడి పెట్టా. పంట ఎండిపోతే తొలిగించేందుకు మరో రూ.10 వేలదాకా ఖర్చవుతుంది. దానికీ అప్పు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం తుంపర సేద్యం పరికరాలు అందించి, పంటలను కాపాడాలి.

- ఫక్రుద్దీన్, మడకశిర

ట్యాంకర్ ద్వారా తడి అందిస్తున్నా

రెండెకరాల్లో రాగి పంట సాగుచేశా. వర్షాభావంతో ఎండిపోతోంది. బోరు ఉన్న రైతు వద్ద నీరు కొనుగోలు చేసి, ట్యాంకర్ ద్వారా పంటకు అందిస్తున్నా. నీటికి పెట్టే ఖర్చు కూడా గిట్టుబాటు కాదు. ట్యాంకర్ రూ.650 ప్రకారం కొనుగోలు చేస్తున్నా.

- నాగరాజు, ఇరిగేపల్లి

రాగి పంటకు ట్యాంకర్ ద్వారా తడి అందిస్తున్న రైతు నాగరాజు





పంటలు ఎండుముఖం

వారంలో వర్షం పడకపోతే ఆశలు వదులుకోవాల్సిందే

ఆందోళనలో అన్నదాతలు

వేరుశనగ చెట్టుకు ఆరేడు కాయలు

మడకశిర, సెప్టెంబరు14: రాష్ట్రమంతా విస్తారంగా వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగిపొర్లుతుంటే మడకశిర ప్రాంతంలో మాత్రం చినుకు జాడలేదు. దీంతో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు ఎండుముఖం పట్టాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు కొంత మంది రైతన్నలు ట్యాంకర్ల ద్వారా తడి అందిస్తున్నారు. వారంరోజుల్లో వర్షం పడకపోతే వేరుశనగ, కంది, రాగి పంటలు ఎండిపోతాయనీ, తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక సరిహద్దు అయిన మడకశిర ప్రాంతంలో సాగునీటి వనరుల్లేవు. ఖరీఫ్‌లో వర్షాధార పంటలే అన్నదాతలకు ఆధారం. దశాబ్దకాలంగా అతివృష్టి, అనావృష్టితో వేరుశనగ పంట దెబ్బతిని, తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది వేరుశనగ పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవకపోవడంతో పంట ఎండిపోతుండడంతో పశువులకు గ్రాసం అయినా దక్కుతుందని రైతన్నలు ట్రాక్టర్లు పెట్టి, తొలిగించారు. ఈసారైనా పంట సాగు చేసి అప్పుల ఊబి నుంచి బయటపడదామని అన్నదాతలు ఆశించారు. అధిక వడ్డీకి అప్పులు తెచ్చి, పంటలు పెట్టారు. ఈసారి కూడా వర్షాభావంతో పంట ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం, పదిరోజుల్లో వర్షాలు పడకపోతే వేరుశనగ పంటను తొలగించుకోవాల్సిందేనని రైతన్నలు పేర్కొంటున్నారు.

పెట్టుబడి సర్వం నష్టం

వేరుశనగ పంట ప్రస్తుతం ఊడలు దిగి, కాయలు బలపడే సమయం. వర్షం కురవకపోవడంతో చెట్లు ఎండుముఖం పడుతున్నాయి. వారంరోజుల్లో వర్షం పడక పోతే కాయలు డొల్లగా మారిపోతాయని రైతన్నలు అంటున్నారు. ఎకరాలో వేరుశనగ పంట సాగుకు రూ.12000దాకా ఖర్చవుతుంది. ప్రభుత్వం అందించిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలు ఎకరాకు సరిపోతాయి. అంతకుమించి భూమి ఉన్న రైతులు బయట మార్కెట్‌లో అధిక ధరకు విత్తనాలు కొనుగోలు చేశారు. అలా పెట్టుబడి పెరిగిందని రైతన్నలు అంటున్నారు. ఇప్పటికే వేరుశనగ ఎండిపోతోందనీ, వేరుశనగ కాయలు కూడా చెట్టుకు ఆరేడు ఉన్నాయనీ, దిగుబడి కూడా తగ్గుతోందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అగళి మండలంలోని ఇరిగేపల్లి, హుళ్కెర, బ్యాడిగెర, అమరాపురం మండలంలోని పలుచోట్ల ట్యాంకర్ల ద్వారా పంటలకు తడులందించి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం తుంపర సేద్యం పరికరాలు అందించి, పంటలను కాపాడాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

భార్యకు ప్రేమతో...



నేడు సతీమణిని ప్రశంసించే రోజు

ఉద్యోగం.. వ్యవసాయం.. వ్యాపారం..! ఏదైనా సరే పురుషులు చేస్తారు.. స్త్రీలూ చేస్తారు. సూటిగా చెప్పాలంటే.. భార్యభర్తలు ఇద్దరూ చేస్తారు. కానీ భర్త ఆ పనికి మాత్రమే పరిమితమౌతారు. కానీ ఆమె అలా కాదు. ఆయనతో సమంగా బయట కష్టపడుతూనే.. ఇంటి పనులు, వంట పనులు, పిల్లల చదువులు, బంధువులొస్తే సపర్యలు.. ఇలా అన్నీ చూసుకోవాలి. తేడా వస్తే మగ మహారాజులతో మాటలు పడాలి. ఇది కొందరికి మాత్రమే అర్థమౌతుంది. కానీ అందరూ అర్థం చేసుకోవాలి. ఆమెను గౌరవించాలి. ఉద్యోగం, వ్యాపారం.. ఏవీ చేయకుండా ఇంటి పట్టున ఉన్నా సరే.. ఆమెకు తీరిక ఉండదు. అందరూ నిద్ర లేవకముందే మేల్కొవాలి. అందరూ నిద్రపోయాక తను నిద్రకు ఉపక్రమించాలి. ఈ రెండింటి నడుమ ఆమె పడే శ్రమను గుర్తించి.. గౌరవించాలి కదా..? ఆమెకు తోడుగా నిలబడాలి కదా..? అప్పుడే కదా తన కళ్లలో ఆనందం కనిపించేది..! ఇదే ఉద్దేశంతో ఏటా సెప్టెంబరు మూడో ఆదివారం 'భార్యలను ప్రశంసించే రోజు'గా ప్రపంచం నిర్వహించుకుంటోంది. భార్య పడే శ్రమకు తగిన గుర్తింపు ఎలా లేదో.. ఈ రోజుకు కూడా అలాగే.. పెద్దగా గుర్తింపు లేదు. అందుకే.. ఉమ్మడి జిల్లాలోని కొందరు ప్రముఖులను ఆంధ్రజ్యోతి పలకరించింది. అతని గురించి ఆమెను, ఆమె గురించి ఆయనను అడిగితే.. సిగ్గుల మొగ్గలు తొడిగారు. మరో ప్రపంచంలో విహరించారు. భావోద్వేగానికి గురయ్యారు. ఆ విశేషాలతో ప్రత్యేక కథనం..!

ఆమె శ్రమను గుర్తించాలని గుర్తు చేసే రోజు.. తను ఎంత ముఖ్యమో ఆలోచించాల్సిన రోజు



'నేను ఐఏఎస్ అయ్యాక విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉంటున్నాను. అందుకే బంధువులను చాలావరకూ కలవలేను. కానీ బంధాలు దూరం కాకుండా నా భార్య చూసుకుంటుంది. అందరితో సన్నిహితంగా మెలుగుతుంది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటుంది. ఆ విషయంలో తనను మెచ్చుకుంటూ ఉంటాను. తను డాక్టర్. మైక్రో బయాలజీలో ఎండీ చేశారు. టీచింగ్ ప్రొఫెషన్ అంటే తనకు ఇష్టం. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మానవ సంబంధాలకు ఆమె ఎంతగానో ప్రాధాన్యం ఇస్తారు. అందుకే వైద్య విద్యార్థులు నా భార్యను బాగా ఇష్టపడతారు..' అని తన అర్ధాంగి డాక్టర్ భూమిక చంద్రలాలి గురించి ఎంతో గొప్పగా వర్ణించారు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.

బంధాల భూమిక..!

వైవాహిక జీవితం గురించి ప్రశ్నించగానే ఆయన సిగ్గుపడిపోయారు. ముఖంలో సీరియస్ నెస్ మాయమై.. నవ్వులు విరిశాయి. 'ఎప్పుడైనా మేడమ్‌ను మెచ్చుకున్నారా..? ఏ విషయంలో..?' అని అడగ్గానే ఆయన బంధాలు, బంధుత్వాల గురించి మాట్లాడారు. అవి తమకు ఎంత ముఖ్యమో చెప్పకనే చెప్పారు. బంధువులతో తన భార్య టచ్‌లో ఉంటారని, ఎవరినీ దూరం కానివ్వరని, ఆ విషయంలోనే ఎప్పుడూ మెచ్చుకుంటుంటానని అన్నారు. 'భార్యమీద ఏదో ఒక సందర్భంలో కోప్పడటం సహజమే కదా..? అలా ఏమైనా జరిగిందా..?' అంటే, అలాంటి పరిస్థితి ఇంతవరకూ రానేలేదని అన్నారు. ఇకపై ఎప్పుడూ వచ్చే అవకాశం కూడా లేదని తన భార్యపై అపార నమ్మకం ప్రకటించారు. 'నేను ఎక్కువగా వృత్తి ధర్మం గురించే ఆలోచిస్తాను. కానీ తను తన వృత్తితోపాటు మా కుటుంబ భవిష్యత్తు గురించి కూడా ఆలోచిస్తుంది. అవసరం మేరకే ఖర్చు పెడుతుంది. భవిష్యత్తు అవసరాలకు పొదుపు పాటిస్తుంది. ఇవి కూడా నాకు ఆమెలో నచ్చే గుణాలు..' అని అన్నారు.

'పెళ్లంటే ఏడేడు జన్మల బంధం అంటారు కదా..? అందుకే భూమిక నాకు దొరికిందేమో..! నాపై ప్రేమ, అభిమానాన్ని ఏనాడూ దాచుకోదు. నిరంతరం పంచుతూనే ఉంటుంది. తను దొరకడం నా అదృష్టం. ఆమె నా జీవితానికి ఒక కానుక. అందుకే తనకు కానుకలు ఇవ్వడం నా హాబీ..! విధి నిర్వహణలో భాగంగా ఎక్కడికి వెళ్లినా.. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా దొరికే వస్తువులు ఏమిటో తెలుసుకుని.. కొని తెచ్చి ఇస్తుంటాను. మంగళగిరిలో ఉన్నప్పుడు మంగళగిరి పట్టుచీరలు, ఉప్పాడ వెళ్లినప్పుడు అక్కడి పట్టుచీరలు.. జిల్లాకు వచ్చాక ధర్మవరం పట్టుచీరలు కొని కానుకగా ఇచ్చాను..' అని సంబరపడిపోయారు.



'పెళ్లి కాకముందు ఎప్పుడూ పని చేస్తూ ఉండేవాడిని. కానీ ఆమె నా జీవితంలోకి వచ్చాక ప్రతి పనినీ ప్రణాళికాబద్ధంగా చేయడం నేర్చుకున్నాను. ఇంటి నుంచి బయట అడుగు పెట్టగానే నేను కలెక్టర్..! విధి నిర్వహణ తప్ప వేరే ఆలోచన ఉండదు. ఇంటికి వెళ్లాక నేను మా కుటుంబంలో సభ్యుడిని. అక్కడ పాలనాపరమైన అంశాలపై ఎలాంటి చర్చ, ప్రస్తావన ఉండదు. కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తాను.. అంతే.' అని అన్నారు. ప్రస్తుతం తన భార్య గర్భిణి అని, ఇంటిపట్టునే ఉంటున్నారని అన్నారు. ఒకరికి ఒకరు కానుకగా మారిన కలెక్టర్ దంపతులకు.. ఉమ్మడి కానుక త్వరలో అందనుందన్నమాట..!

- అనంతపురం టౌన్



మా ఆయన బంగారం..!

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


'ఆయన జనజీవన స్రవంతిలోకి కలిశాక మా ఇంటికి చాలామంది వచ్చేవారు. అందరికీ భోజనం పెట్టమనేవారు. అప్పటికి ఇంట్లో వంట మనుషులు లేరు. ఎవరినీ నమ్మే పరిస్థితి లేదు. అందుకే నేను, మా అత్త కలిసి కష్టపడి వండి పెట్టేటోళ్లం. అందరూ వెళ్లిపోయాక ఆయన నా వద్దకు వచ్చేవారు. 'పని ఎక్కువైంది కదా..? ఇబ్బందిగా ఉందా..? కాళ్లు పీకుతున్నాయా..?' అని అడిగేవారు. ఒక భార్యకు అంతకు మించిన ప్రశంస ఏముంటుంది..? పైకి గంభీరంగా కనిపించినా.. మా ఆయన మనసు బంగారం..' అన్నారు మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత.



'ఆయన ఏది చెప్పినా నేను చేస్తాను అని నమ్మేవారు. 2004లో పెనుకొండ ఎమ్మెల్యేగా ఆయన పోటీ చేశారు. ఆ సమయంలో ఉమ్మడి జిల్లా బాధ్యతలను ఆయనే చూసుకుంటున్నారు. అందుకే పెనుకొండ ప్రచార బాధ్యతలను నాకు అప్పగించారు. ఆయన కోరిక మేరకు ప్రచారం చేశాను. నియోజకవర్గవ్యాప్తంగా పర్యటించాను. నా కాళ్లకు బొబ్బలు వచ్చాయి. ఎస్ఎస్ గేటు వద్ద నన్ను చూశారు. నా పట్టుదలను మెచ్చుకున్నారు. డాక్టర్‌ను పిలిపించి దగ్గరుండి నాకు వైద్యం చేయించి వెళ్లారు..'

'బయట ఎన్ని సమస్యలున్నా ఇంట్లోకి వచ్చాక వాటి ప్రస్తావన తెచ్చేవారు కాదని, తనతో, పిల్లలు, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేవారని గుర్తు చేసుకున్నారు. 'ఆయనకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. పొలం పనులకు వచ్చేవాళ్లతో వారానికి ఒకసారి ఇంటి బయట మంచమేసుకుని కూర్చొని మాట్లాడేవారు. వారితో కలిసి భోజనం చేసేవారు. నన్ను, పిల్లలను ఎంతగానో ప్రేమించేవారు. తన వెంట వస్తే ఏదైనా జరగవచ్చునన్న ఆలోచనలో పిల్లలను ఎన్నడూ వెంట తీసుకెళ్లేవారు కాదు. ఆయనకు చదువంటే ఇష్టం. పిల్లలను బాగా చదివించాలని అనుకునేవారు. ఇక్కడి వాతావరణానికి దూరంగా హైదరాబాదులో మా బంధువుల ఇంట్లో ఉంచి చదివించారు. పిల్లలను నాకు చూడాలనిపించేది. మారం చేసేదాన్ని. ఆయన కోప్పడినా.. ఆ తరువాత హైదరాబాదుకు పంపేవారు..' అని కుటుంబాన్ని పరిటాల రవీంద్ర ఎంత బాగా చూసుకునేవారో గుర్తు చేసుకున్నారు.

'ఎన్ని సమస్యలున్నా.. మా పెళ్లి రోజు ఆయనకు ప్రత్యేకం. స్వయంగా చీర కొని తెచ్చేవారు. ఒకసారి ఏకంగా 27 చీరలను మా పెళ్లి రోజు కానుకగా కొని తెచ్చి ఇచ్చారు. నా ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఆయన ఉండగా.. చివరి పెళ్లి రోజుకు తెచ్చి ఇచ్చిన చీరను ఇప్పటికీ భద్రంగా దాచుకున్నాను. అది అపురూపమైన కానుక..' అని చెబుతూ.. భావోద్వేగానికి గురయ్యారు.



చివరి కానుక.. ఈ చీరే..

'చివరి రోజున కూడా ఆయనతోనే ప్రయాణించాను. వెంకటాపురం నుంచి అనంతపురం వెళ్లాము. పార్టీ మీటింగ్ చూసుకుని మధ్యాహ్నం భోజనానికి వస్తానని చెప్పారు. ముద్ద, చెట్నీ చేయమన్నారు. ఆ తరువాత ఫోన్ చేశారు. తాను అక్కడే భోజనం చేశానని, మమ్మల్ని తినమని చెప్పారు. అవే ఆఖరి మాటలు. కాసేపటికే విషయం తెలిసింది. అరవింద నగర్‌లోని ఇంటి నుంచి పార్టీ కార్యాలయానికి పరుగున వెళ్లాం. రక్తపు మడుగులో కనిపించారు. ఆ క్షణం నుంచి ఆయన ఆశయాలను నా భుజనా వేసుకున్నా. మమ్మల్ని నమ్ముకున్నవారికి అండగా ఉంటున్నా..'

- అనంతపురం టౌన్

ఇల్లు.. ఇల్లాలు..!

ఇదే ఆనందం.. సింపుల్..! ఎస్పీ జగదీష్



'ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలి..' అంటారు కదా పెద్దలు..! ఇంటిని అందంగా, ఆహ్లాదంగా మార్చేసే ఇల్లాలు తనకు దొరికిందని సంబరపడిపోయారు ఎస్పీ జగదీష్..!

పోలీసుల జీవితం ఎలా ఉంటుందో తెలియంది కాదు..! ఖాకీ దుస్తులు ఒంటిపై ఉన్న సమయంలో టార్చిలైట్ వేసి వెతికినా వారి ముఖంలో నవ్వు కనిపించదు. నేరాలు, నేరస్థులు, శాంతిభద్రలు..! నేర పరిశోధనలు, కేసులు.. ఒత్తిళ్లు! ఇలాంటి అంశాలతో డీల్ చేసేవారి ముఖంలో నవ్వులను ఎలా వెతుక్కోగలం..? పోలీసులను చూడగానే జనంలో ఒక రకమైన భయం కలగడానికి ఇదీ ఒక కారణం..! అనుక్షణం సవాళ్లతో కూడిన వృత్తిలో ఉండే పోలీసులు.. కుటుంబ జీవితాన్ని బ్యాలెన్స్ చేయడం అంత తేలిక కాదు..! భార్య, పిల్లలతో గడిపేందుకు ఒక్కోసారి ఏమాత్రం సమయం దొరకదు..! 'ఇలాంటి క్లిష్టమైన శాఖలో.. కీలకమైన ఎస్పీ స్థానంలో ఉన్నారు. జీవితం ఎలా ఉంది సర్..?' అని అడిగితే.. 'ఏముందీ.. నేను నా విధి నిర్వహణ గురించి ఆలోచిస్తాను.. ఆమె నా గురించి ఆలోచిస్తుంది.' అని తన భార్య హేమ గురించి ఒక్క మాటలో చెప్పేశారు ఎస్పీ జగదీష్..!

'ఎప్పుడైనా.. ఏ విషయంలోనైనా మెచ్చుకున్నారా..? మీకు తను ఎంత ముఖ్యమో చెప్పారా..?' అని అడిగితే.. 'పండుగల సమయంలో ఇంటి వాతావరణాన్ని సమూలంగా మార్చేస్తుంది. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అందంగా తీర్చిదిద్దుతుంది. ఇల్లు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఆ విషయంలో మెచ్చుకోకుండా ఉండలేను. పండుగ సమయాలలో ఆమెను ప్రశంసిస్తుంటాను..' అని ఎంతో సంతోషంగా చెప్పారు. 'ఒక్కోసారి అనుకున్న విధంగా చేయలేం. అనుకోని సంఘటనలు జరుగుతుంటాయి. హడావుడిగా వెళ్లాల్సి వస్తుంది. అలాంటి సమయంలో భార్య బాధపడటం సహజం కదా..? తనూ బాధపడుతుంది. తిరిగి రాగానే ఓదారుస్తాను. అర్థం చేసుకుంటుంది..' అని అన్నారు. అర్థం చేసుకునే భార్య దొరకడం ఒక వరం..! పోలీసు అధికారులకు ఇంకాస్త ఎక్కువ వరం..!

'2018 నవంబరు 25న మా వివాహం జరిగింది. మాకు మూడేళ్ల బాబు.. పేరు శ్రీహాన్. నా జీవన విధానం చాలా సింపుల్‌గా ఉంటుంది. పెళ్లికి ముందు మరీ సింపుల్‌గా ఉండేది. అలాంటి సోఫా మీద (తనకు ఎదురుగా ఉన్న సోఫాను చూపుతూ..) కూడా సర్దుకుని నిద్రపోవడం అలవాటు. పెళ్లయ్యాక బాధ్యతలు పెరిగాయి. విధి నిర్వహణతోపాటు కుటుంబానికీ సమయం కేటాయించాల్సి వస్తోంది. ఒక్కోసారి భార్యాపిల్లలతో గడపడం సాధ్యం కాదు. సెప్టెంబరు 3న మా బాబు బర్త్ డే..! మరుసటి రోజే నా పుట్టిన రోజు కూడా..! సెలబ్రేట్ చేసుకోవాలని ముందుగానే ప్లాన్ చేసుకున్నాం. కానీ విజయవాడలో వరదల కారణంగా, అక్కడ సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లాల్సి వచ్చింది. ఇలాంటివి తరచూ జరుగుతుంటాయి. హేమ అర్థం చేసుకుంటుంది..'



'మా మధ్య దాపరికాలు ఉండవు. ప్రతి విషయాన్ని తనతో షేర్ చేసుకుంటాను. అప్పుడప్పుడు టూర్ ప్లాన్ చేస్తుంది. ఎక్కడికి వెళ్లాలో నిర్ణయిస్తుంది. ఫ్లైట్ టిక్కెట్స్, రూమ్, భోజనం.. అన్ని విషయాలూ తనే చూసుకుంటుంది. నాపై ఆధారపడదు. స్వేచ్ఛగా వ్యవహరిస్తుంది. ఆ విషయం నాకు ఎంతగానో నచ్చుతుంది. జనవరి 19న తన పుట్టిన రోజు. నాకు ప్రత్యేకం. ఆ రోజు ఏదో ఒక కానుక తప్పనిసరిగా ఇస్తుంటాను. చీరలు, జ్యువెలరీ, మొబైల్ ఫోన్.. ఇలా ఏదో ఒకటి..!'

- అనంతపురం క్రైం

అన్నింటా వెన్నంటే..!

జేసీ ప్రభాకర్ రెడ్డి

'అదృష్టం ఏమిటంటే.. నా భార్యకు రాజకీయాలు, వ్యాపారం అంటే చాలా ఇష్టం. ఈ రెండు అంశాల్లోనూ ఆమె వెనకుండి సలహాలు ఇస్తుంది. విజయవంతం కాగానే ఆమెను మెచ్చుకుంటాను. నా కష్టసుఖాల్లో ఆమె వెన్నంటి ఉంటుంది. మనో ధైర్యాన్ని ఇస్తుంది..' అని తన సతీమణి ఉమ గురించి చెప్పారు మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి. జేసీ కుటుంబం పేరు చెబితే ఎప్పుడూ గరం గరం అంశాలే గుర్తుకు వస్తాయి. వేడి వేడి రాజకీయాలు, వాడీవేడి మాటల తూటాలే గుర్తుకొస్తాయి. పైకి ఇలా కనిపించే నాయకులు కుటుంబ విషయంలో కాస్త నాజూకుగానే ఉంటారు. భార్య, పిల్లలను అమితంగా ఇష్టపడుతుంటారు. అదే జాబితాలో ఉన్నారు జేసీ ప్రభాకర్ రెడ్డి.



'ఉమ నా జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాతే మొత్తం మారిపోయింది. నేను చేసే ప్రతిపనిలోనూ ఆమె ఉంటుంది. నా విజయానికి తోడ్పడుతుంది. వ్యాపారం, రాజకీయంలో ఆమె సలహాలే నాకు శిరోధార్యం. ప్రతి విషయంలోను ఆమె సలహాలు, సూచనలు పాటించడం నాకు అలవాటు. అవి విజయవంతమైనప్పుడు తనను మెచ్చుకుంటాను. ప్రతికూల ఫలితం వచ్చినప్పుడు కాస్త కోపగించుకుంటాను. మెచ్చుకున్నా.. కోపగించుకున్నా.. ఆమె నన్ను ఏమీ అనదు..' అని తన జీవితంలో భార్య ప్రాధాన్యమేమిటో వివరించారు.

'మా కుటుంబంలో అందరికీ కోపం ఎక్కువ. కానీ నా భార్య మాత్రం ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. అది ఆమెకు దేవుడి ఇచ్చిన వరం. భూమాతకు ఉన్నంత ఓర్పు తనకు ఉండడం నాకు నచ్చిన విషయం. ఎంత కష్టం వచ్చినా ఆమె ముఖంపై చిరునవ్వు చెరగదు. మా ఇంట్లో పనివాళ్లను కూడా ఆప్యాయంగా పలకరిస్తుంది. వారి కష్టాలను తెలుసుకుని సాయపడుతుంది. ఆమెకు ఉన్నంత ఓపిక, ఓర్పు నాకు లేవు..' అన్నారు నవ్వుతూ..!

'నా భార్యకు సింప్లిసిటీ చాలా ఇష్టం. మా అమ్మకు సంబంధించిన బంగారు నగలు ఉన్నాయి. వాటి గురించి ఎప్పుడూ పట్టించుకోదు. బంగారం అంటే ఆమెకు పెద్దగా ఇష్టం లేదు. మెడలో ఒక చైన్ మాత్రమే వేసుకుంటుంది. కానీ చేతికి కట్టుకునే వాచ్‌లు అంటే చాలా ఇష్టం. వాటిని కొనిద్దామని అనుకుంటాను. కానీ వద్దంటుంది. తానే కొనుకుంటాను అంటుంది..' అని చెబుతూ.. కానుకలు ఇచ్చే భాగ్యం కూడా తనకు ఇవ్వడం లేదని సరదాగా అన్నారు.

- తాడిపత్రి

నా ఇష్టాలను గౌరవిస్తారు..!

భర్త గురించి మంత్రి సవిత

'ఆయనకు వ్యవసాయం ఇష్టం. రైల్వే కాంట్రాక్టర్ కూడా..! ఎప్పుడూ బిజీగా ఉంటారు. నాకు సేవ చేయడం ఇష్టం. ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి అండగా నిలవడం ఇష్టం. ఒకసారి మాట ఇచ్చానంటే నెరవేర్చి తీరుతాను. ఇవన్నీ ఆయనకు ఇష్టం. కొవిడ్ సమయంలో బయటకు వచ్చేందుకే వణికిపోయారు అందరూ. అలాంటి సమయంలో బాధితులకు అండగా నిలవాలని బయటకు వచ్చాను. వందలాది మందికి కొవిడ్ కిట్లు, నిత్యావసర సరుకులను అందజేశాను. ఇలాంటివి ఎన్నెన్నో..! సాయం చేసే గుణం నా తండ్రి ఎస్ఎస్ రామచంద్రారెడ్డి నుంచి నాకు అబ్బింది. ఆయన మార్గంలోనే నడుస్తున్నాను. నా ఆలోచనలను గౌరవించే భర్త నాకు దొరికారు. అది నా అదృష్టం' అన్నారు మంత్రి సవిత.





భార్యలను ప్రశంసించే రోజు నేపథ్యంలో.. 'ఎప్పుడైనా.. ఏ విషయంలోనైనా మెచ్చుకున్నారా..?' అని అడిగితే.. భర్తను మెచ్చుకుంటూ.. రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు మంత్రి సవిత.

తన భర్త వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతోనే రాజకీయాల్లో ఒడిదుడుకులను అధిగమించి, మంత్రి అయ్యానని అన్నారు. అన్నింటా తోడుగా నిలిచే భర్త లభించడానికి మించి ఒక మహిళకు కానుక ఏముంటుందని వ్యాఖ్యానించారు. 'ప్రజా సమస్యలపై పోరాడే క్రమంలో నాపై 14 కేసులు నమోదు చేశారు. సీబీఐ దాడులు కూడా చేయించారు. సుమారు 55 రోజులపాటు ఒంటరిగా గడపాల్సి వచ్చింది. అలాంటి సంక్షోభ సమయంలో ఆయన నాకు తోడుగా నిలిచారు. న్యాయం కోసం ఎంత దూరమైనా వెళదామని ధైర్యం నూరిపోశారు. ఎన్నడూ ఆయన నాపై కోప్పడిన సందర్భమే లేదు..' అని అన్నారు. 'వివాహం కారణంగా నేను కోల్పోయింది ఏమీ లేదు. పైగా ఒక గొప్ప భాగస్వామిని పొందగలిగాను. ఆయన ఏనాడూ నా ఇష్టానికి వ్యతిరేకంగా నడుచుకోరు. తనకు భక్తి ఎక్కువ. అందుకే ఆలయాల సందర్శనకు ఎక్కువగా వెళుతుంటాము. సమస్యలు ఎదురైతే చర్చించుకుని పరిష్కరించుకుంటాము. నేను మంత్రిని అయినా.. ఆయన తీరులో మార్పు లేదు. మునుపటిలాగే సాధారణ పౌరుడిలా వ్యవహరిస్తారు. అహంకారం, అధికార దర్పం ఆయన దరికి చేరవు..' అని అన్నారు.

- పెనుకొండ టౌన్

నేనే ఆమె తొలి ప్రతిపక్షం



'మా వైవాహిక జీవితానికి 16 ఏళ్లు..! ఎన్నడూ తనను పొగిడింది లేదు. తను రాజకీయాల్లో ఉంది. విమర్శలను నా నుంచే మొదట ఎదుర్కొంటుంది. ఒక రకంగానే నేనే ఆమెకు తొలి ప్రతిపక్షం. సభలు, సమావేశాల్లో మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడమని సూచిస్తాను. సబ్జెక్టు తెలిస్తేనే మాట్లాడమని నిక్కచ్చిగా చెబుతాను. ఏమీ తెలియనప్పుడు మాట్లాడటం కంటే మౌనంగా ఉండటం మంచిదని చెబుతాను.' అని అన్నారు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ భర్త నరసింహ మూర్తి. వైవాహిక జీవితంలో చిటపటలు సహజమేనని, తాను కోపగించుకున్నా మౌనంగా స్వీకరిస్తుందని అన్నారు. 'ఈ పదహారేళ్లలో నేను కోప్పడటేమగానీ.. గిరిజను బుజ్జగించిన సందర్భాలు లేవు..' అని నవ్వుకుంటూనే అన్నారు. మొత్తానికి పోలీసు అనిపించుకున్నారు..! కానీ ఇంటర్ చదువుతున్న అమ్మాయిని పెళ్లి చేసుకుని.. ఇంట్లో బంధించలేదు. తనకు చదువుకునే స్వేచ్ఛ, రాజకీయాల్లో ప్రవేశించే స్వేచ్ఛను కల్పించారు.



'మొదట్లో తను వంటలు తెలియని పిల్ల. నాకు అన్నీ వచ్చు. బ్రహ్మాండంగా వంట చేస్తాను. నా నుంచే గిరిజ నేర్చుకుంది. పెళ్లయిన తర్వాతే ఇంటర్ పూర్తి చేసింది. డిగ్రీ పూర్తి చేసింది. ప్రస్తుతం లా చేస్తోంది. రాజకీయాల్లో ఉంటూనే చదువను కొనసాగిస్తోంది. ఆమె ఇష్టాన్ని నేను గౌరవిస్తాను. చదువుకుంటాను అంటే ఏనాడూ అభ్యంతరం చెప్పలేదు. ప్రోత్సహిస్తూనే ఉన్నాను. రాజకీయాల్లోకి వెళ్లినా అభ్యంతరం చెప్పలేదు. ప్రజల సమస్యలపై పోరాడుతుంటే ప్రోత్సహించాను. ఇప్పుడు తను జడ్పీ చైర్‌పర్సన్..! అయినా పొగిడేది లేదు. విమర్శలే చేస్తాను. నా కూతురు చేతన కూడా విమర్శలు చేస్తుంది..' అని ఇంట్లో ప్రతిపక్ష పాత్ర గురించి చెప్పుకొచ్చారు నరసింహమూర్తి.

అంటే.. గిరిజమ్మ నిత్యం ఇంట్లో నెట్ ప్రాక్టీస్ చేస్తున్నట్లు..! బయట ఎలాంటి విమర్శలు ఎదురౌతాయో, వాటికి ఎలా సమాధానాలు చెప్పాలో తండ్రీకూతుళ్లు శిక్షణ ఇస్తున్నారన్నమాట..!

నో.. నేను పొగడనంతే..!

భర్త ప్రోత్సాహం ఉంటే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలుగుతారు. ఇందుకు ఉదాహరణ.. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ జీవితం. ఇంటర్ విద్యార్థినికి ఇంట్లోవాళ్లు పెళ్లి చేసినా.. ఉన్నతంగా చదివించే భర్త ఆమెకు లభించారు. వంటలు రాని భార్యకు వండిపెట్టి, వంట నేర్పి, చదివించి, రాజకీయాల్లోకి వెళ్లే స్వేచ్ఛను ఇచ్చి.. ప్రోత్సహిస్తున్నారుగానీ.. ఒక్కసారి కూడా 'నువ్వు సూపర్ గిరిజా..' అని పొగిడిందే లేదట..! పోలీసు అయినంతమాత్రాన భార్యను పొగడటం మానేస్తే ఎలా మూర్తిగారూ..?

'ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతున్నప్పుడే నాకు పెళ్లి కుదిరింది. పెద్దలు మాట్లాడుకున్నారు.. పెళ్లి చూపులు అయ్యాక రెండు వారాల్లోనే పెళ్లి చేసేశారు. మా ఆయన హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు. పెళ్లి జరిగిన రెండు వారాలకే అక్కడ కాపురం పెట్టించారు. ఇంట్లో గారాబంగా పెరిగాను. పెద్దగా వంటలు రావు. పప్పు, అన్నమే నాకు వచ్చే పెద్ద వంటలు..! ఆ రెండింటితో సర్దుకోలేక ఆయన నా మీద చిందులు వేసేవారు..' అని చెబుతూ నవ్వు ఆపుకోలేకపోయారు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ.

తనే నా వంటల మాస్టర్..!

'ఆయనకు వంటలు బాగా వచ్చు. చికెన్ రెసిపీ, బిర్యానీ, డబుల్ కా మీఠా, పాయసం, వెజిటబుల్ రైస్.. ఇలాంటివన్నీ బాగా చేసేవారు. చెఫ్ మాస్టర్ అవతారం ఎత్తారు. వంటలు చేయడం నేర్పించారు..' అని నవ్వుకుంటూనే గుర్తు చేసుకున్నారు. '2014లో కార్పొరేటర్‌గా నా రాజకీయ జీవితం మొదలైంది. కాలనీల్లో సమస్యలపై పోరాడేదాన్ని ఆయన నన్ను బాగా ప్రోత్సహించారు. ఆయన ప్రోత్సాహంతోనే కొవిడ్ సమయంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఆయన మాటలు, విమర్శలే నన్ను రాజకీయంగా రాటుదేలేలా చేస్తున్నాయి. నేను ఏదీ అడగాల్సిన అవసరం లేదు. ఆయనే గుర్తించి.. అన్నీ సమకూరుస్తారు. చీరలు, ఆభరణాలు.. అన్నీ ఆయన ఇచ్చిన కానుకలే. ఆయన నా జీవితంలోకి వచ్చాక బాధపడిన క్షణాలు లేవు. చిటపటలన్నీ జీవితంలో భాగమే కదా..! అవి కూడా మంచి జ్ఞాపకాలు నాకు..' అని సంతోషం వ్యక్తం చేశారు.



- అనంతపురం విద్య

సమస్యల స్టాండ్

- అడుగడుగునా ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం
- దివ్యాంగులు, వృద్ధులు బస్టాండ్ ఆవరణలోకి వెళ్లాలంటే ఇబ్బందులు
- సొంత ఆదాయమే లక్ష్యంగా నిర్ణయాలు
- నేడు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాకతోనైనా సమస్యలు తీరేనా...?


బస్టాండ్ వరణలోకి వాహనాలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన గ్రిల్

ధర్మవరం, సెప్టెంబరు 14: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. స్థానిక ఆర్టీసీ అధికారుల అలసత్వం, నిర్లక్ష్యమే ఇందుకు కారణం. ప్రయాణికులే మా దేవుళ్ల అనే మాటను మరచి.. ఆదాయమే మా లక్ష్యం.. అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

- **వృద్ధుల పాట్లు**

కొన్ని ఆర్టీసీ బస్టాండ్లలో ఆవరణంలోకి వృద్ధులు, వికలాంగులు, గర్భిణులను వీల్ చైర్‌లో తీసుకొని వెళ్లేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. అయితే ఇక్కడి ఆర్టీసీ అధికారులు అందుకు పూర్తిగా విరుద్ధంగా ఏకంగా గ్రిల్ ఏర్పాటు చేశారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు అక్కడి నుంచి నడుచుకుంటూ.. ఆర్టీసీ బస్టాండ్‌లోని అష్టకష్టాలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది.

- **తాగునీరూ కరువే**

బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేవు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తప్పని పరిస్థితుల్లో బస్టాండ్ ఆవరణంలోని దుకాణాల్లో వాటర్ బాటిళ్లను కొంటున్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని ఆ దుకాణాదారులు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. వాటిపై అధికారుల తనిఖీలు ఉండవు.

- **రాత్రి అయితే చీకటే**

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ అధికారుల బాధ్యత. అయితే ఇక్కడి బస్టాండ్‌లో రాత్రి ఎనిమిది గంటలు కాగానే అధికారులు లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేస్తున్నారు. దీంతో బస్టాండ్‌లో ప్రయాణికులు చీకట్లో... దోమలతో కుట్టించుకుంటూ.. బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఉంది. కనీసం బస్టాండ్ ప్రయాణికులు ఉన్నారే అనే మానవత్వాన్నీ అధికారులు చూపడం లేదు. బస్సుల గురించి సమాచారం తెలుసుకోవాలంటే.. విచారణ కేంద్రంలో కూడా ఏ అధికారీ అందుబాటు ఉండదు.


బస్టాడ్ ఆవరణంలోకి వచ్చే దారి ఉన్న టీస్టాళ్లు, రోడ్డుపై ఉన్న బైక్‌లు


రాత్రి 8 గంటలకే తాళంమేసిన మురుగుదొడ్డు

- **మురుగుదొడ్లకు తాళాలు**

రాత్రి ఎనిమిది గంటలు దాటితే.. బస్టాండ్‌లో లైట్లు.. ఫ్యాన్లు ఆఫ్ చేయడమే కాకుండా.. మరుగుదొడ్లు కూడా తాళాలు వేస్తున్నారు. వివిధ దూర ప్రాంతాల నుంచి అనేక మంది ఈ బస్టాండ్ మీదుగా రాతంత్రా పుట్టపర్తికి వెళ్తుంటారు. అలాంటి వారికి మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- **ఆదాయమే లక్ష్యం..**

ఆర్టీసీ ఆదాయమే లక్ష్యంగా బస్సు లోపలికి వెళ్లే రహదారి ఇరువైపులా టీస్టాల్స్ ఏర్పాటు చేశారు. దీంతో ఆ టీస్టాల్స్ కు వెళ్లే వారు.. వాటి ఎదుటే తమ బైక్‌లను ఉంచుకున్నారు. దీంతో బస్సులు సాండ్‌లోకి రావడానికి ఇబ్బందిగా మారింది. కనీసం బస్టాండ్ వద్ద బోర్డు కూడా లేకపోవడంతో కొత్తగా పట్టణానికి వచ్చేవారు బస్టాండ్ ఎక్కడా.. అని ఇతరులను అడిగితే తప్ప తెలుసుకోలేని పరిస్థితి.

- **ఉత్త కవరింగ్**

ఎవరైనా మంత్రులు, ఉన్నతాధికారులు ఈ బస్టాండ్‌కు వచ్చినప్పుడు మాత్రం ఇక్కడి ఆర్టీసీ అధికారులు ఎక్కడలేని హడావిడి చేస్తారు. ప్రయాణికులు సమస్యలు వారికి తెలియనివ్వకుండా.. అంతా బేషుగ్గా ఉన్నట్లు కవరింగ్ చేస్తుంటారు.

- **నేడు మంత్రి రాక**

కొత్త బస్సులను ప్రారంభించడంలో భాగంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ధర్మవరం బస్టాండ్‌కు వస్తున్నారు. కనీసం ఆయనైనా ఈ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రైం న్యూస్

డాబా నిర్వాహకుడి ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 14 : మండలంలోని జెర్రికుంటపల్లి వద్ద శ్రీఖాద్రీ డాబా నిర్వాహకుడు మిరియాల రమేష్ (50) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రాత్రి కుటుంబసభ్యులతో కలసి టీవీ చూశాడు. అనంతరం మిద్దెపైన ఉన్న గదిలోకి వెళ్లాడు. ఎంత సేపటికీ ఆయన కిందికిరాకపోవడంతో అతని భార్య కమలమ్మ పైకి వెళ్లి చూసింది. గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉండటాన్ని గుర్తించి గట్టిగా కేకలు వేసింది. బంధువులు వచ్చి గమనించగా.. అప్పటికే ఆయన మరణించినట్లు గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పాముకాటుతో మహిళ మృతి


రామలక్ష్మమ్మ (ఫైల్)

నల్లమాడ, సెప్టెంబరు 14 : మండలంలోని వంకరకుంట గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ (48) పాముకాటుతో శనివారం మరణించింది. తన పొలంలో బోరుబావి వద్ద ఆమె పంటను తొలగిస్తుండగా పాము కాటు వేసింది. బంధువులు వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి ద్విచక్రవాహనంలో తీసుకెళ్లారు. వైద్యం ప్రారంభించకముందే ఆమె మరణించింది. రామలక్ష్మమ్మకు భర్త గంగన్న, ఇద్దరుకుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ..



పుట్టపర్తిరూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియన వ్యక్తి శనివారం మరణించాడు. స్థానికులు సమాచారం అందించడంతో మృతదేహాన్ని మునిసిపల్ కార్మికులు శ్మశానవాటికకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 14: మండలంలోని వేమారెడ్డిపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జెర్రికుంటపల్లికి చెందిన మిరియాల నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. నరసింహులు మహమ్మదాబాద్ క్రాస్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. కదిరి నుంచి గోరంట్ల వెళ్తున్న కర్ణాటక క్వారీస్ వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో నరసింహులు ఎడమకాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. స్థానికులు, పోలీసులు అతన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు నివాళి

బుక్కపట్నం, సెప్టెంబరు 14: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాయంలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ చంద్రనాయక్ శుక్రవారం గుండెపోటుతో మరణించాడు. శనివారం ఆయన స్వగ్రామమైన బుక్కపట్నంలోని గరుగుతండాలో ప్రభుత్వ లాంచనాతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతదేహానికి ముదిగుబ్బ సీఐ శ్యామలరావు, పట్నం ఎస్ఐ నరసింహుడు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూర్యకుమార్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యుడు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, ఆనంద్ నివాళ్లు అర్పించారు. చంద్రనాయక్‌కు భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని మృతికి ఎస్పీ రత్న ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బీజేపీ సభ్యత్వ నమోదు

పుట్టపర్తి, సెప్టెంబరు 14 : స్థానిక హనుమాన్ సర్కిల్‌లో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండమరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుల తలమర్ల హరికృష్ణ, కత్తిరాజారెడ్డి, జ్యోతిప్రసాద్, బాలగంగాధర్, సురేంద్రబాబు, కళ్యాణ్ పాల్గొన్నారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు



నల్లచెరువు, సెప్టెంబరు 14 : పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం పాలాభిషేకం చేసి.. మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుకు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించినట్లు ఈఓ రవీంద్రరాజు తెలిపారు. నల్లచెరువు భజన బృందం సభ్యులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

తనకల్లు, సెప్టెంబరు 14: వన్యప్రాణుల సంరక్షణపై స్థానిక జనజాగృతి కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని చిన్నరామన్నగారిపల్లి, ఈతోడు, రాచినేపల్లి, కొక్కంటి, కోర్తికోట, చెక్కవారిపల్లి గ్రామాల్లో అంతరించిపోతున్న వన్యప్రాణుల సంరక్షణపై చేపట్టాల్సిన కార్యక్రమాలను జనజాగృతి ఈడీ రాంప్రసాద్ వివరించారు. తోడేళ్లు, కప్పలక్కులు, చినంగి నక్కలు, అడవి గొర్రెలు, ఎలుగుబంట్లు, అలవాలు, నక్కలు, కొండకోతులను ఎలా కాపాడుకోవాలన్న విషయాన్ని చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు క్రిష్ణారెడ్డి, నాగేంద్ర, రెడ్డెప్ప నాయుడు, గ్రామస్థులు, జనజాగృతి సిబ్బంది, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శ్రీరాములు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ పర్యటన వివరాలు

ధర్మవరం: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆది, సోమవారాలు ధర్మవరంలో పర్యటిస్తారని బీజేపీ నాయకులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 11 గంటలకు పట్టణంలోని 8వ వార్డులో అయ్యప్పస్వామి ఆలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొంటారని, సోమవారం ఉదయం 10గంటలకు బీజేపీ క్యాంప్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభిస్తారని, మధ్యాహ్నం ఆర్డీటీ క్రీడామైదానంలో అటల్ బిహారీ వాజపేయి క్రికెట్ టోర్నీలో విజేతలకు బహుమతులు అందజేస్తారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి మృతి

హిందూపురం: హిందూపురం-గోరంట్ల ప్రధాన రహదారిలోని చిన్నగుడ్డంపల్లి వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి శనివారం రాత్రి మృతి చెందాడు. పట్టణంలోని శ్రీకంఠపురానికి చెందిన కురుబ అచ్చప్ప(63) శనివారం ఉదయం చిన్నగుడ్డంపల్లి వద్ద ఉన్న పొలానికి దిచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అచ్చప్ప అక్కడికక్కడే మృతిచెందాడు.

విద్యుదాఘాతంతో మహిళ దుర్మరణం

పావగడ : అర్సిగెరె పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తూరు గ్రామంలో ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు తగిలి త్రివేణి (24)అనే మహిళ శనివారం మృతి చెందింది. మృతురాలి భర్త కృష్ణమూర్తి తెలిపిన మేరకు ఇటీవల కొత్తగా నిర్మించిన ఇంటి లోంచి ఇనుప కడ్డీలు తీసుకెళ్తున్న సందర్భంలో ఇంటిపై ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

మంత్రిగారూ.. చేనేత పరిశ్రమను కాపాడండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ముసుగు మధు

ధర్మవరం, సెప్టెంబరు 14: చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చేనేత పరిశ్రమను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఆ పరిశ్రమ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు పేర్కొన్నారు. శనివారం స్థానిక కదిరిగేటు సమీపంలోని బ్రహ్మంగారి ఆలయంలో చేనేతల సమస్యలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. చేనేత 11 రకాల రిజర్వేషన్ల నిబంధనలకు విరుద్ధంగా ప్యూర్ టూ ప్యూర్ చీరలను జేఆర్ సిల్క్స్ అధినేత జింకా రామాంజినేయులు తయారు చేస్తూ చేనేత పరిశ్రమను చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. జెట్లూమ్స్ ఏర్పాటు చేసి దిగువ, మధ్య తరగతి నేతన్నల కొడుపు కొడుతున్నారని విమర్శించారు. ఆయన నిర్వాకం వల్ల పనులు లేక ... గిట్టుబాటు ధర లేక నేతన్నలు ఆత్మహత్యలు చేసుకొంటున్నారన్నారు. పవర్‌లూమ్స్ దాటికి తట్టుకోలేక ధర్మవరం చేనేత పరిశ్రమ కకావికలమై పోతోందన్నారు. వేల్పుమడుగు వద్ద ఉన్న జేఆర్ చేనేత ఫ్యాక్టరీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారన్నారు. అధికారులకు కూడా భారీ ఎత్తున ముడుపులు అందుకున్నట్లు ఆరోపించారు. చేనేత సమస్యలపై ఆర్డీఓ కార్యాలయం వద్ద ఈనెల 18న ఐక్య చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జింకా చలపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవిందు, అనంతపురం జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, చేనేత కార్మికసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, శ్రీనివాసులు, ఏఐటీయూసీ నాయకులు రమణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, కాంగ్రెస్ పార్టీనాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న గౌస్‌లాజం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 14: ఆచార్య దేవోభవ- 2024 జాతీయ అవార్డుకు మండ లంలోని కమ్మవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కట్టుబడి గౌస్ లాజం ఎంపిక య్యారు. సర్వేపల్లి రాధాక్రిష్ణన్ 137వ జయంతి సందర్భంగా యువతేజం కలాం రీజన్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యాబోధన, సాహి త్య సాంస్కృతిక, సమాజ సేవా రంగంలో విశేష కృషి చేసిందనకు గౌస్‌లాజంను ఆ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును శనివారం తిరుపతి అతనికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణ మునిమనవడు సుబ్రహ్మణ్యంశర్మ అందజేశారు.


విజేతకు ట్రోఫీ అందిస్తున్న యూటీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

టీచర్లకు క్రీడాపోటీలు

కదిరి అర్బన్, సెప్టెంబరు 14: యుటీఎఫ్‌ను ఏర్పాటు చేసి... 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాల ఆవరణంలో మహిళ ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు శనివారం నిర్వహించారు. త్రోబాల్, టెన్నికాయింట్, షాట్‌పుట్, షటిల్, స్పీడ్‌వాక్ తదితర పోటీలు నిర్వహించారు. క్రీడల్లో విన్నర్, రన్నర్ టీమ్‌లకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సభ్యులు సుధాకర్, శ్రీనివాసులు, తాహేర్‌వలీ, సుబ్బారెడ్డి, నరేష్ కుమార్, నారాయణస్వామి, మహిళ ఉపాధ్యాయులు, పీఈటీలు యశోద, సుజాత, సంధ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం


పుట్టపర్తిలో న్యాయాధికారి రాకేష్, కదిరిలో న్యాయాధికారి జయలక్ష్మి, ధర్మవరంలో న్యాయాధికారి గీతావాణి సమస్యలు వింటున్న దృశ్యం

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 14 : జిల్లా వ్యాప్తంగా పలు కోర్టుల్లో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. పుట్టపర్తి జూనియర్ సివిల్ కోర్టులో న్యాయాధికారి రాకేష్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 76 కేసులను పరిష్కరించారు. ఇందులో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసులు, లెక్కల యదుభూషణ్, ఇందిర, చల్లాచంద్రశేఖర్, మౌనిక, రాజగోపాల్, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

కదిరిలీగల్ : స్థానిక కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్‌ను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ న్యాయాధికారి జయలక్ష్మి ప్రారంభించారు. అప్పులు తీసుకుని సక్రమంగా చెల్లించకపోతే బ్యాంకుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, రుణాలను సకాలంలో తిరిగే చెల్లిస్తే బ్యాంకులు మరింతమందికి రుణ సాయం చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రూ.21 లక్షల నగదు రికవరీతో పాటు 58 సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.

ధర్మవరంరూరల్ : స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి నిర్వహించారు. మొత్తం 155 కేసులను పరిష్కరించారు.

జూడో విజేత నందినికి అభినందన



ధర్మవరంరూరల్: చెన్నైలో నిర్వహించిన ఖేలో ఇండియా సౌత్ జోన్ జాతీయ స్థాయి సబ్ జూనియర్ జూడో పోటీల్లో చిగిచెర్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల 9వ తరగతి విద్యార్థి నందిని 32 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన విషయం తెల్సిందే. నందినిని జిల్లా మంత్రి సవిత పెనుకొండలోని తన నివాసానికి శనివారం పిలుపించుకొని అభినందించారు.

సీతారాం ఏచూరికి నివాళి

నల్లమాడ : స్థానిక బస్టాండ్ కూడలిలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ, సీపీఎం నాయకులు శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ

రూ.50 వేలను అందజేసిన సాధారణ మహిళ



పల్లె రఘునాథరెడ్డికి 50 వేల చెక్కు అందిస్తున్న ఈశ్వరమ్మ

పుట్టపర్తి, సెప్టెంబరు 14 : పుట్టపర్తి మున్సిపాల్టీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లికి చెందిన సాధారణ మహిళ పెద్దన్నగారి ఈశ్వరమ్మ విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. శనివారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయానికి వచ్చిన ఆమె రూ. 50 వేలను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి విరాళంగా అందజేసింది. టీడీపీ నాయకులు, పలువురు స్థానికులు ఆమెను అభినందించారు.

ఓబుళదేవరచెరువు: విజయవాడలో వరద బాధితుల సాయంకోసం మండలంలోని కొండకమర్లలో కూటమి నాయకులు విరాళాల సేకరణ చేపట్టారు. మూడు రోజులుగా వీరు పంచాయతీ కేంద్రంతో పాటు గ్రామాల్లో విరాళాలు సేకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పొగాకు జాకీర్ అహమ్మద్, మాజీ సరపంచ్ పొగాకు షఫీ, నాయకులు జయచంద్రారెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, ఇర్షాద్, సంఘాల శీనా, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెపిరిటి అంజనప్ప, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని పంచాయతీల్లో టీడీపీ నాయకులు వరద బాధితులకు బియ్యం సేకరించారు. చౌటుకుంటపల్లిలో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి 35 ప్యాకెట్ల బియ్యాన్ని సేకరించారు. ఆ బియ్యాన్ని మండల కన్వీనర్ మైలే శివశంకర్ ఇంటికి తరలించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు దాదాపు 550 ప్యాకెట్ల బియ్యాన్ని సేకరించామని, మరో రెండు రోజులు ఈ కార్యక్రమాన్ని చేపడతామని, ఈ బియ్యాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి అందజేస్తామని చెప్పారు.


కొండకమర్లలో విరాళాలు సేకరిస్తున్న కూటమి నాయకులు


బియ్యం సేకరించిన చౌటకుంటపల్లి టీడీపీ నాయకులు

ఎప్పుడూ ఇంతేనా..?

- ప్రహసనంగా వినాయక నిమజ్జనం
- ఒక్కరోజులో పూర్తిచేయని నిర్వాహకులు
- ఆలస్యంపై 'పురం' ప్రజల అసహనం
- కొద్దిమంది నిర్వాహకులతోనే సమస్య..!

హిందూపురం, సెప్టెంబరు 14: పట్టణంలో వినాయక నిమజ్జనం ఇష్టానుసారం జరుగుతోంది. రెండు, మూడు రోజులకుగాని నిమజ్జన కార్యక్రమం పూర్తవడం లేదు. గతంలో ఉదయం విగ్రహాలు మండపాల నుంచి తరలిస్తే అర్ధరాత్రి, తెల్లారేసరికి నిమజ్జనం పూర్తయ్యేది. కానీ గత ఏడాది మూడు రోజు సాయంత్రానికి నిమజ్జన కార్యక్రమం ముగిసింది. ఈసారికూడా రెండు రోజులపాటు జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కనీవిని ఎరుగని రీతిలో 1200మంది పోలీసులను విని యోగించారు. అంతమంది బందోబస్తుకు వచ్చినా సాయంత్రం 6గంటల తరువాత విగ్రహాలు మండపాల నుంచి రోడ్డుపైకి వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో రాత్రి 12గంటల సమయంలోకూడా మండపం నుంచి బయటికి రాని పరిస్థితి నెలకొంది. దీంతో నిమజ్జనం ఒకరోజులో ముగియడం లేదు. ఫలితంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ప్రధానంగా పట్టణంలోని మూడు విగ్రహాల నిర్వాహకులు గత మూడేళ్లుగా కుంటి సాకులు చెబుతూ శోభాయాత్రను ఆలస్యం చేస్తున్నారు. పోలీసులు గట్టిగా హెచ్చరించడానికి జంకుతున్నారు. దీంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందని మిగిలిన వినాయక మండపాల నిర్వాహకులు విమర్శిస్తున్నారు.


భారీ వినాయకుడి తరలింపునకు విద్యుత్ తీగల అడ్డు..

కొరవడిన సమన్వయం

ప్రతి ఏడాది పోలీసు, రెవెన్యూ, ట్రాన్స్‌కో, మునిసిపల్, ఆర్ అండ్‌బీ, అగ్నిమాపక అధికారుల సమన్వయంతో నిమజ్జనం సాగేది. ఈ సారి కొన్నిశాఖలకు చెందిన అధికారులు బదిలీ కావడంతోపాటు కొన్నిశాఖలకు చెందిన అధికారులు వరద నేపథ్యంలో విజయవాడకు వెళ్లారు. దీంతో ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. విగ్రహాల వద్ద పోలీసులు తప్ప మరే శాఖల అధికారులు కనిపించలేదు. విగ్రహాల నిమజ్జనం రెండో రోజు జరగడంపై పట్టణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. శుక్రవారం రాత్రి 9గంటల వరకు విగ్రహాలు చూడటానికి జనం రోడ్డుపై ఉండగా అప్పటి వరకు 10, 20 విగ్రహాలు మాత్రమే రోడ్డెక్కాయి. మిగిలిన విగ్రహాలు మండపాల నుంచి కొంతదూరం వచ్చి ఆగిపోవడంతో వీక్షించడానికి వచ్చిన జనం బేజారయ్యారు.

550కి పైగా విగ్రహాల ఏర్పాటు

హిందూపురం నియోజకవర్గంలో ఈ ఏడాది 550కి పైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఇవి పోలీసు రికార్డుల్లో ఉన్నవి. కానీ చిన్నాచితక విగ్రహాలు మరో వందదాకా ఉంటాయి. అయితే పట్టణంలో శనివారం నిమజ్జనానికి వచ్చిన విగ్రహాలు 150కి పైగా ఉన్నాయి. పట్టణంలో కొన్ని విగ్రహాల మధ్య పోటీ రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొనే పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితుల్లో శుక్రవారం రాత్రి రెండు మూడు చోట్ల పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. అంబేడ్కర్ నగర్‌కు చెందిన విగ్రహం భారీ ఎత్తు ఉండటంతో పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద భవనంపైపడి కూలిపోయింది. దీంతో అక్కడే నిమజ్జనం నిర్వహించారు. శనివారం ఉదయం డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్ ఆంజనేయులు తమదైన శైలిలో హెచ్చరికలు జారీ చేయడంతో కొంతమేర విగ్రహాలు కదిలాయి. నిమజ్జనం ఆలస్యంపై జిల్లా ఎస్పీ తీవ్రంగా స్పందించారు.


ఒక్క విగ్రహానికి ఎంతమంది పోలీసుల బందోబస్తో


మరమ్మతులకు గురైన వాహనం

ఎత్తు పెంచడంతో ఇక్కట్లు

విగ్రహాల ఎత్తు పెంచరాదని, పట్టణంలో ఎత్తైన విగ్రహాలు తరలించే ఏర్పాట్లు లేవని పోలీసులు ప్రతి ఏడాది చెబుతూనే ఉన్నారు. ఎత్తు ఎక్కువగా ఉండటం వల్ల నిమజ్జనానికి తరలించే సమయంలో విద్యుత్ తీగలు, డిష్ వైర్లను కత్తిరించాల్సి ఉంటుందని పోలీసులు చెబుతున్న మాటలను నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారు. దీంతో శోభాయాత్ర సమయంలో నిర్వాహకులతో పాటు పోలీసులు నానా అవస్థలు పడుతున్నారు. హిందూపురంలో ఇరుకైన రహదారులు, తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటంతో శోభాయాత్ర ఈసారి ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు కనీసం రెండు కిలోమీటర్ల దూరం కూడా వెళ్లలేదు. ప్రతి విగ్రహం వచ్చినప్పుడు విద్యుత్ తీగలు తొలగించడం, చెట్లు నరకడం ముందుకు సాగనంపడం జరిగింది. ఈ ఏడాది నాలుగు విగ్రహాల ఎత్తు చాలా ఎక్కువగా ఉండటంతో 40అడుగుల ఎత్తు ఉన్న విద్యుత్ తీగలు కూడా తగిలాయి. దీని వల్ల శోభయాత్ర ఆలస్యమైంది. దీంతో డీఎస్పీ, ఇరువురు సీఐలు తీవ్రంగా స్పందించారు. తమదైన శైలిలో నిర్వాహకులకు వార్నింగ్ ఇచ్చారు. దీనికారణంగా విగ్రహాలు మధ్యాహ్నం నుంచి కొంతమేర ముందుకెళ్లాయి. లేకుండా ఉంటే పట్టణంలోనే నిలిపివేసేవారు.

రాత్రివరకు కొనసాగిన నిమజ్జనం


శనివారం సాయంత్రం నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

హిందూపురం, సెప్టెంబరు 14: పట్టణంలో వినాయక నిమజ్జనం రెండో రోజు శనివారం రాత్రి వరకు కొనసాగింది. శోభాయాత్ర శుక్రవారం ఆలస్యంగా ప్రారంభం కావడంతో శనివారం రాత్రి వరకు నిమజ్జన కార్యక్రమం కొనసాగింది. మొదటి రోజు వంద విగ్రహాలు నిమజ్జనం కాగా ఉదయం నుంచి 35విగ్రహాలు నిమజ్జనం చేశారు. కానీ గరిడి, కట్టకింద, బాజూజీనగర్, ముక్కడిపేట విగ్రహాలు ఆలస్యంగా నిమజ్జనం చేశారు. ఎప్పటిలాగే ఈ విగ్రహాలు ఆలస్యంగా గుడ్డం కోనేరుకు రాగా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే కొన్ని విగ్రహాల నిర్వాహకులు నిమజ్జనానికి ఆలస్యంగా తీసుకురావడంపై జిల్లా ఎస్పీ రత్న, డీఎస్పీ మహేష్‌లు సీరియస్‌గా పరిగణించారు. నిర్వాహకులకు సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. భారీ బందోబస్తు ఏర్పాటు చేసినా మరుసటి దినం రాత్రివరకు నిమజ్జనం జరగడంపై డీఐజీ కూడా సీరియస్ అయ్యారు.


శనివారం రాత్రి వినాయకుడి నిమజ్జనం

కోనాపురంలో...


కోనాపురంలో వినాయక నిమజ్జనంలో మహిళలు, యువత

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 14: మండలంలోని కోనాపురంలో శనివారం వినాయక నిమజ్జనం ఘనంగా చేశారు. ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తీసుకెళ్లి సాయంత్రం ముత్యాల చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం వినాయకుని ముందుంచిన లడ్డూను వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన చిత్తారు నారాయణస్వామి కుమారుడు జయకృష్ణ వేలంపాటలో రూ.5వేలకు లడ్డూను దక్కించుకున్నాడు.

ఘనంగా గణేశుడి ఊరేగింపు

గోరంట్ల, సెప్టెంబరు 14: పట్టణంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో వినాయక చవితి ముగింపు ఉత్సవాల సందర్భంగా స్వామివారిని శనివారం ఊరేగించారు. ఈనెల 6 నుంచి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయ్ కుమార్ 9రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. పూజల అనంతరం శనివారం ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై పురవీధుల్లో ఊరేగించారు.

సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

లేపాక్షి, సెప్టెంబరు 14: పారిశుధ్య పనులు, అభివృద్ధి పనులు చేపట్టకుండా పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని కల్లూరు సర్పంచ్ వసుంధరదేవిపై పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదులో పంచాయతీ సర్పంచ్ తన ప్రమేయంలేకుండా లాగిన్‌లో సీఎఫ్ఎంఎస్‌లో రూ.3,19,222ను ఆగస్టు 31న డ్రాచేశారని పేర్కొన్నారు. ఎటువంటి పనులు చేయకుండా నకిలీ బిల్లులతో నిధులను దుర్వినియోగం చేశారన్నారు.

నేడు మానవహారం

పావగడ, సెప్టెంబరు 14: విశ్వ ప్రజా ప్రభుత్వ దినోత్సవం సందర్భంగా ఆదివారం మానవహారం నిర్వహిస్తున్నట్లు తుమకూరు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి కృష్ణప్ప పేర్కొన్నారు. బీజాపూర్ జిల్లా నుంచి తుమకూరు జిల్లా సరిహద్దు వరకు దాదాపు 10 లక్షల మందితో మానవహారం ఏర్పరుస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు తరలి రావాలని కోరారు. తుమకూరు జిల్లా నుంచి 2లక్షల మందికిపైగా ఈ కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు.

ఎన్‌ఎస్‌పీఆర్ కళాశాలకు ఏ గ్రేడ్



హిందూపురం అర్బన్, సెప్టెంబరు, 14: పట్టణ పరిధిలోని ఎన్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ డా. ప్రగతి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 10, 11 తేదీల్లో కళాశాలను ఉన్నత అధికారుల బృందం సందర్శించిందన్నారు. సెప్టెంబరు 5,6 తేదీల్లో ముగ్గురు సభ్యులతో కూడిన మరో బృందం కూడా కళాశాలను సందర్శించిందన్నారు. కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి నివేదికను బెంగళూరులోని న్యాక్ కార్యాలయానికి పంపారన్నారు. దాన్ని న్యాక్ అధికారులు పరిశీలించి ఏ గ్రేడ్ ఇస్తూ మెయిల్ ద్వారా సమాచారం అందించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. నాలుగు పాయింట్లకు గాను 3.01 పాయింట్‌లు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో కళాశాల నిలిచిందన్నారు. ఇందుకు అధ్యాపక, అధ్యాపకేతర బృందం సమష్టి కృషే కారణమన్నారు.

బీకేకు ఆర్యవైశ్య సంఘం సన్మానం


పార్థసారథిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

పెనుకొండ, సెప్టెంబరు 14: హిందూపురం ఎంపీ బీకే పార్థ సారథిని స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. సాయంత్రం పెనుకొండ టీడీపీ కార్యాలయంలో బీకే పార్థసారథిని కలిసిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆయనకు పూల మాలవేసి శాలువలు కప్పి మెమెంటో అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సుధాకర్‌గుప్త, నాయకులు యాడికి నాగరాజు, శ్రీరాములు, మోహనక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ దుర్మరణం

పావగడ, సెప్టెంబరు 14: అర్సిగెరె పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తూరు గ్రామంలో ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు తగిలి త్రివేణి (24)అనే మహిళ శనివారం మృతి చెందింది. మృతురాలి భర్త కృష్ణమూర్తి తెలిపిన మేరకు ఇటీవల కొత్తగా నిర్మించిన ఇంటిలోంచి ఇనుప కడ్డీలు తీసుకెళ్తున్న సందర్భంలో ఇంటిపై ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు ...

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 14: మండలంలోని జంగాలపల్లి గ్రామ సమీపంలో కొడికొండ-శిర హైవేలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ జయలలిత తెలిపారు. జంగాపల్లి సమీపంలోని హైవే వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి దాదాపు 55 ఏళ్ల వయసు ఉండవచ్చని, మృతదేహంపై తెలుపు గళ్ల చొక్క ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు పరిగి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

పేద కుటుంబానికి ఐసీడీఎస్ ఆసరా


పిల్లలను బాలసదన్‌లో చేర్పిస్తున్న సీడీపీఓ శాంతలక్ష్మి

పెనుకొండ, సెప్టెంబరు 14: కూడు, గూడు లేక భిక్షం ఎత్తుకుని పొట్టపోసుకుంటున్న పేద కుటుంబానికి ఐసీడీఎస్ అధికారులు ఆసరా కల్పించారు. పుట్టపర్తి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ దంపతులకు ఐదుగురు సంతానం. నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరిది కడుపేద కుటుంబం. బతుకుతెరువుకోసం కుటుంబం మొత్తం రైల్వే స్టేషన్ పరిసరాల్లో భిక్షమెత్తుకుని పొట్ట పోసుకుంటున్నారు. కొద్దిరోజుల క్రితం ఈ కుటుంబం పెనుకొండకు వచ్చి రైల్వే గేటు సమీపంలోని ఫ్లైఓవర్‌వద్ద నివసిస్తున్నారు. రైల్వేగేటు వద్ద సమయంలో వాహనదారులను యాచిస్తూ పొట్టపోసుకుంటున్నారు. శనివారం దీనిని గమనించిన ఐసీడీఎస్ పెనుకొండ ప్రాజెక్ట్ సీడీపీఓ శాంతలక్ష్మి విషయాన్ని బాలల సంరక్షణ సమితి దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను హిందూపురం బాల సదన్‌లో చేర్పించారు. పిల్లల భవిష్యత్తుకు మంచి ఆసరా లభించడంపట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సీడీపీఓ శాంతలక్ష్మికి, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోండి


రాజీ పత్రం అందిస్తున్న న్యాయాధికారి

హిందూపురం, సెప్టెంబరు 14: కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 115 కేసులు పరిష్కారమయ్యాయి. అనంతరం ఏడీజే మాట్లాడుతూ రాజీమార్గం రాజమార్గమని దీనిని ఇరువర్గాలు కక్షిదారులు ఆలోచించి రాజీ అయ్యే కేసులన్నీ పరిష్కరించుకుంటే ఆర్థికంగా చితికిపోకుండా సమస్య వెంటనే పరిష్కారం అవుతుందన్నారు. ఐపీసీ 15, భూతగాదా 12, అక్రమ ఇసుక రవాణా 11, ఎక్సైజ్ 3, ప్రీలిటిగేషన్ 54, చిన్నపాటి తగాదాలు 20కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ నాయకులు రాజశేఖర్, ఏపీపీలు ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, ఎస్బీఐ రీజనల్ మేనేజర్ శశిధర్, లోక్‌అదాలత్ సభ్యులు సిద్దు, కళావతి, సంతోష్ పాల్గొన్నారు.

144 కేసులు పరిష్కారం

పెనుకొండ టౌన్: జాతీయ లోక్‌అదాలత్‌లో 144 కేసులు పరిష్కారమైనట్లు హిందూపురం సీనియర్ సివిల్‌జడ్జి శ్రీధర్ తెలిపారు. శనివారం పెనుకొండ కోర్టు ఆవరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్ సివిల్‌జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ పాల్గొన్నారు. బ్యాంక్‌కు సంబంధించిన, తదితర కేసులను పరిష్కరించారు.

మడకశిరలో 83..

మడకశిరటౌన్: మడకశిర కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 83 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి ఆర్.అశోక్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు. 83 కేసులకు గాను రూ.16,44,920లు ప్రభుత్వానికి జమ అయినట్లు తెలిపారు. 8 బ్యాంకు కేసులకు సంబంధించి రూ.8,11,700 సెటిల్మైనట్లు తెలిపారు. క్రిమినల్ కేసులు 49 పరిష్కారం కాగా రూ.50వేలు, ఎస్‌టీసీ కేసులు 4 పరిష్కారం కాగా రూ.7.20లక్షలు, ఎక్సైజ్ కేసులు 19 పరిష్కారం కాగా రూ.63,220 వసూలైనట్లు తెలిపారు. సివిల్ కేసులు మూడు పరిష్కారమైనట్లు తెలిపారు.

గ్రానైట్ లారీ పట్టివేత

గుడిబండ, సెప్టెంబరు 14: మండలంలోని కొంకల్లు క్రాస్‌వద్ద అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వాహనాన్ని మైన్స్ అండ్ జియాలజీ అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి మృతి

హిందూపురం, సెప్టెంబరు 14: హిందూపురం- గోరంట్ల ప్రధాన రహదారిలోని చిన్నగుడ్డంపల్లి వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి శనివారం రాత్రి మృతి చెందాడు. పట్టణంలోని శ్రీకంఠపురానికి చెందిన కురుబ అచ్చప్ప(63) శనివారం ఉదయం చిన్నగుడ్డంపల్లి వద్ద ఉన్న పొలానికి దిచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అచ్చప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు.

సెబ్ విలీనంపై హర్షం


సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

హిందూపురం, సెప్టెంబరు 14: కూటమి ప్రభుత్వం సెబ్‌ను ఎక్సైజ్‌లోకి విలీనం చేయడంపై సెబ్ అధికారులు, పోలీసులు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో ఎక్సైజ్‌ను విడగొట్టి స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరోగా ఏర్పాటుచేసి ఎక్సైజ్ శాఖను నిర్వీర్యం చేశారు. ఎక్సైజ్ అధికారుల విన్నపం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్‌ను రద్దు చేశారు. గతంలో మాదిరిగానే ఎక్సైజ్‌గానే ఉంటుందని జీఓ విడుదల చేయడంపట్ల శనివారం హిందూపురంలో సెబ్ పోలీస్ స్టేషన్‌వద్ద హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు కమలాకర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించాలి



వాల్మీకుల సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం అందిస్తున్న జిల్లా వాల్మీకి ఉపాధ్యక్షుడు రమేష్ తదితరులు

అగళి, సెప్టెంబరు 14: రాష్ట్రంలోని బోయ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్పించాలని కేంద్ర మంత్రి కుమారస్వామికి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి విన్నవించారు. బెంగళూరులోని జేడీఎస్ కార్యాలయంలో వారు కేంద్రమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్ వాల్మీకి సమస్యలను కేంద్రమంత్రికి విన్నవించి మెమొరాండం అందజేశారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి (బోయ) వాల్మీకి కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ శ్రీనివాస్, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, వాల్మీకి కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

కుంచిటిగ వక్కలిగలను ఓబీసీలోకి చేర్చండి

రొళ్ల: కుంచిటిగ వక్కలిగలను ఓబీసీలోకి చేర్చాలని కేంద్రమంత్రి కుమారస్వామిని టీడీపీ రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం.పాండురంగప్ప కోరారు. శనివారం బెంగళూరులోని జేడీఎస్ పార్టీ కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈసందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

జర్నలిస్టులకు హెల్త్ ప్రీమియం చెల్లించిన మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 14: పెనుకొండ నియోజకవర్గంలోని జర్నలిస్టులకు హెల్త్ స్కీం ప్రీమియంను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెల్లించారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో ప్రీమియంకు సంబంధించిన రసీదులను శనివారం అందించారు. 42మంది జర్నలిస్టులకు రూ.52,500 చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఏవైనా సమస్యలుంటే తప్పక పరిష్కరిస్తామన్నారు.

కరెంటు లేక అవస్థలు

- రెండు రోజులుగా అంధకారంలో హిందూపురం
- ఎక్కడి తీగలు అక్కడ తెంచేసిన వైనం
- విద్యుత్ లేక ఇబ్బందుల్లో ప్రజలు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 14: పట్టణంలో రెండు రోజులుగా అంధకారం నెలకొంది. దీంతో దాదాపు రెండు లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. శనివారం కూడా చాలా ప్రాంతాల్లో సరఫరా లేకుండా పోయింది. దీంతో ప్రజలు రాత్రిపూట ఉక్కపోత, దోమలతో అల్లాడిపోయారు. పట్టణంలో భారీ గణపతి ప్రతిమలు ఏర్పాటు చేయడంతో వాటిని నిమజ్జనానికి తరలించేందుకు 11 కేవీ, 33 కేవీ విద్యుత్ తీగలతో పాటు ఇళ్లకు, దుకాణాలకు విద్యుత్‌ను అందించే తీగలకు ఎక్కడికక్కడ తొలగించారు. కొన్ని చోట్ల పద్ధతి ప్రకారం విద్యుత్ తీగలకు తెంచివేశారు. వాటితో పాటు డిష్ తీగలు తెంచి వేశారు. మరి కొన్ని చోట్ల అప్పటికప్పుడు ఎత్తైన విద్యుత్ స్తంభాలు ఎక్కి మెయిన్ సరఫరా తీగలను తొలగించారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేదు. సిబ్బంది నిరంతరాయంగా తొలగించిన తీగలను ఓ వైపు నుంచి మరమ్మతులు చేసుకుంటూ వచ్చినా సమస్య పరిష్కారమవ్వలేదు.

ప్రజల అసహనం

ఇది దోమలు ఉధృతంగా ఉండే సీజన్ కావడంతో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎత్తైన విగ్రహాల ఏర్పాటుతోనే విద్యుత్ సరఫరా నిలిపేశారని ఆగ్రహిస్తున్నారు. అలాగే సెల్‌ఫోన్ చార్జింగ్ లేక అవస్థలు పడ్డారు. ఇంతకు ముందు ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని పలువురు ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ముందస్తు ఆలోచన లేకుండా భారీ విగ్రహాలు ఏర్పాటు చేసి అసౌకర్యం కల్పించడం ఏమిటనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.